సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఆఫీస్ అసిస్టెంట్ వృత్తి నైపుణ్య కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరిన వారికి రెండు నెలల శిక్షణ ఇవ్వడంతోపాటు వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నామన్నారు. ఆసక్తి గల 18–35 ఏళ్ల వయసు కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98856 94676 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కార్మికులను ఆదుకోవాలి

ఎంవీపీకాలనీ: బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీ కాలనీలో అంతర్జాతీయ వలస కార్మికుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోజు రోజుకూ వలస కార్మికుల సంఖ్య పెరుగుతోందన్నారు. 2019 కోవిడ్ నుంచి కార్మికుల పరిస్థితులు మరింత దిగజారాయన్నారు. దీనిని చక్కదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త విధానాలను అమలు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వాంతన సంస్థ ప్రతినిధి డాక్టర్ ప్రజ్ఞాన్, ఆసరా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సూర్యతేజనగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సూర్యతేజనగర్‌లో అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులు రూ.54 లక్షలతో ఈ ప్రాంతంలో రోడ్లు, కాలువలు, గెడ్డకు ఇరుపక్కలా రక్షణ గోడల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పనులు వేగంగా జరిపించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ శాంతిరాజు, ఏఈ వెంకటరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

మహారాణిపేట: రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథ్‌రావు, కార్యదర్శి సిహెచ్.వి.రమేష్ కోరారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విశాఖ జిల్లా రెవెన్యూ శాఖ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు యోగి, రవిశంకర్, విశాఖ రెవెన్యూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జిలాని, చైతన్య, ఇతర నాయకులు రామకృష్ణ, వరుణ్, సిద్ధార్థ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

ఆడుతూ.. పాడుతూ

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకట్టుకునేలా విద్యా బోధన

- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు చక్కటి సేవలు
- ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం పంపిణీ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహర్దశ



ఇసుకతోట రజక వీధి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న టీచర్



బొమ్మకు రంగు వేస్తున్న అంగన్‌వాడీ చిన్నారి



అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం తింటున్న పిల్లలు

మద్దిలపాలెం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టిన విషయం తెలిసిందే. వీటిని ప్రీ స్కూళ్లుగా తీర్చిదిద్ది సకల సదుపాయాలు కల్పించారు. ఆడుతూ.. పాడుతూ చిన్నారులకు విద్యా బోధన చేస్తున్నారు. తత్ఫలితంగా ఈ కేంద్రాలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు చక్కటి రీతిలో సేవలందిస్తున్నాయి. పౌష్టికాహారం పంపిణీ, మందుల అందజేత, ఆరోగ్య పరిరక్షణ, పిల్లలకు చదువు వంటి అన్ని అంశాలను శ్రద్ధతో నిర్వహిస్తున్నారు. టేక్ హోం పద్ధతిలో లబ్ధిదారులకు ఇంటికే రేషన్ సరకులు అందిస్తూ వారు ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్‌వాడీ సెంటర్లు తోడ్పడుతున్నాయి.

15, 16, 23 వార్డుల్లో సేవలు

జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురంలో 1, కొత్త వెంకోజీపాలెం–2లో 1 చొప్పున రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 16వ వార్డులోని ఇసుకతోట రజక వీధి తదితర ప్రాంతాల్లో 8 సెంటర్లు నడుస్తున్నాయి. వీటిలో మద్దిలపాలెం 1, 2, 3, 4గా నాలుగు, కేఆర్‌ఎం కాలనీ 1, 2, 4గా మూడు, అంబేడ్కర్ కాలనీలో 1 సెంటర్ నిర్వహిస్తున్నారు. 23వ వార్డులో చైతన్యనగర్ 1, 2, 3, 4 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఒక్కో సెంటర్‌లో 20 మంది చొప్పున చిన్నారులు చదువుకుంటున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో లబ్ధిదారులందరికీ పౌష్టికాహారం అందిస్తున్నారు.

ఇలా బోధన..

అంగన్‌వాడీ కేంద్రాలను అద్భుతంగా తీర్చిదిద్దడంతో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. ఆటపాటలతో కూడిన విద్యను చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ బోధిస్తున్నారు. వారి మేధస్సును, ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బొమ్మలకు రంగులు వేయించడం, పుస్తకాలు, బొమ్మలు, అంకెలు చూపిస్తూ చదువు నేర్పించడం వంటివి చేస్తున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లోనే చిన్నారులకు మధ్యాహ్నం వేళ భోజనం పెడుతున్నారు.

ఇంటికే సరకులు..

చిన్నారులు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో బాధపడకుండా ఉండేందుకు వీలుగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా డ్రై రేషన్ పంపిణీ చేస్తున్నారు. టేక్ హోం పద్ధతిలో ఇంటికే పౌష్టికాహారం సరకులు అందజేస్తున్నారు. లబ్ధిదారులకు 15 రోజులకు ఒకసారి ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ లోపు రెండు కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, పావు కేజీ బెల్లం, పావుకేజీ బెల్లం చెక్కీలు, పావుకేజీ ఖర్జూరం, మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర కేజీ ఆయిల్, 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందిస్తున్నారు. రెండో విడతగా నెలలో 16వ తేదీ నుంచి మొదటి విడతలో ఇస్తున్నట్టే మిగిలిన సరకులు పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ వాడొద్దు.. అనారోగ్యానికి గురికావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

బీచ్‌రోడ్డు: ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించి అనారోగ్యానికి గురికావద్దని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ కోరారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం ఈస్ట్ పాయింట్ కాలనీలోని కేడీపీఎం హైస్కూల్‌లో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ప్రబలుతున్నాయని, వాటిని విడనాడాలని సూచించారు. ఎస్‌ఆర్‌యూ–జీవీఎంసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస రాజమణి మాట్లాడుతూ జనవరి ఒకటి నుంచి 16 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై పూర్తి ఆంక్షలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు తమ కుటుంబ సభ్యులకు వివరించి, వాటి వినియోగానికి అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల అనేక రకాల విషతుల్య రసాయనాలు విడుదలై జీవ వైవిధ్యానికి, భావితరాలకు కలిగించే నష్టాల గురించి వివరించారు. స్కూల్ హెచ్‌ఎం సుమతీబాయి, తెలుగు ఉపాధ్యాయిని సత్యవతి తదితరులు మాట్లాడారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దు.. మానవాళి జీవించడానికి మరో భూగోళం లేదని విద్యార్థులు నినాదాలు పలికారు.

ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుతో ఉపాధి అవకాశాలు



కోర్సు పూర్తి చేసిన విద్యార్థులతో కృష్ణా కళాశాల అధ్యాపక బృందం

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించిన ఆఫీస్ అసిస్టెంట్ అనే మూడు నెలల కోర్సును డిగ్రీ విద్యార్థులకు అందిస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి మొదటి బ్యాచ్ 30 మంది బుధవారం ఫైనల్ ఎవల్యూషన్ కంప్లీట్ చేసుకున్నారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద ఈ కోర్సు నిర్వహించినట్లు చెప్పారు. చెన్నైకి చెందిన శ్రీ ఈశాంత్ ఈ కోర్సును ఫైనల్ ఎవల్యూషన్ చేయడానికి పీఎంకేవై వారు నియమించారన్నారు. ఈ కోర్సుకు సంబంధించిన ఏపీఎస్ ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు ,ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ పి.సుగుణల కృషి అభినందనీయమన్నారు. ఇటువంటి కోర్సులు పూర్తి చేయడం వల్ల విద్యార్థులు ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కామర్స్ విభాగాధిపతి జి.రాజ్‌కుమార్, సంస్కృత విభాగాధిపతి పి.ఉమామహేశ్వరరావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రవిబాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ రాజేశ్వరరావు కోర్సు పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు.

బాధితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న మాల మహానాడు ప్రతినిధులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ముడసర్లోవ పార్కు సమీపంలో కొన్ని దశాబ్దాలుగా నివాసిస్తూ నిరాశ్రయులైన వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఎస్సీ వర్గీకరణ ఎంక్వయిరీ కమిషన్ ప్రతినిధి రాజీవ్ రంజన్ మిశ్రాను మాల మహానాడు జిల్లా ప్రతినిధులు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ముడసర్లోవ పార్కు, రోడ్డు విస్తరణలో ఇక్కడ 36 మంది నివాసాలు కోల్పోయారని, వారికి నష్టపరిహారంగా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. మాల మహానాడు ప్రతినిధులు డి.కోటేశ్వరరావు, టి.బాలస్వామి, సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'గ్రామీణ స్థానిక ప్రభుత్వ సంస్థల్లో సమాంతర వ్యవస్థల పాత్ర, ప్రాముఖ్యత' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను బుధవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించి మాట్లాడారు. అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. సదస్సు సంచాలకులు ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో కొత్త ఏడాది ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సెమినార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ,అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సదస్సు సహ సంచాలకుడు డాక్టర్ టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీహైడ్రేషన్‌పై అశ్రద్ధ వద్దు

బీచ్‌రోడ్డు: నాన్ డయేరియా కేసుల్లో డీహైడ్రేషన్‌పై అశ్రద్ధ వహిస్తున్నారని పలు నివేదికల ద్వారా వెల్లడైనట్లు కెన్‌వ్యూ సీనియర్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ నాగరాజన్ తెలిపారు. బుధవారం ఒక హోటల్‌లో డీహైడ్రేషన్ వల్ల పిల్లలకు కలిగే సమస్యలు, వాటి పరిష్కారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ నివేదిక ప్రకారం నాన్ డయేరియా కేసుల్లో జ్వరాలు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, వైరల్ వ్యాధులు, వేడి వల్ల కలగే అలసట ఉన్నప్పుడు 50 శాతం డీహైడ్రేషన్‌పై అశ్రద్ధ వహిస్తున్నట్లు వెల్లడైందన్నారు. మొదటి రోజే ఓరల్ ఫ్లూయిడ్ ఎలక్ట్రోలైట్స్, ఎనర్జీ రీప్లేస్‌మెంట్ సిఫార్సు చేయడం ద్వారా పిల్లల ఆరోగ్యం వేగంగా మెరుగుపడుతుందన్నారు. డాక్టర్ బి.రవీందర్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతతో ప్రశాంత జీవనం



ప్రవచిస్తున్న సుశీలాజీ

విశాఖ విద్య: వేదాంత ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరింలో భగవద్గీత 10వ అధ్యాయం 'విభూతి యోగం'పై ఆంగ్లంలో ఐదు రోజుల జ్ఞాన యజ్ఞం(ప్రవచనాలు) బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామి పార్థసారథి శిష్యురాలైన సుశీలాజీ ప్రవచిస్తూ నిజ జీవితంలో ప్రశాంత జీవితం గడపడానికి కావలసిన మెళకువలు తెలిపే తత్వజ్ఞానాన్ని బోధించేదే భగవద్గీతని చెప్పారు. విభూతి యోగంలోని 42 శ్లోకాలు, వాటి భావాలను నిత్య జీవితంలో ఎలా ఆచరించాలో తెలియజేశారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. అధిక సంఖ్యలో నగర వాసులు, వేదాంత ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రిస్మస్ పోటీల్లో ఉషారాణి ప్రతిభ



డాక్టర్ శివానంద్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న హెడ్ నర్స్ ఉషారాణి

దాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో నిర్వహిస్తున్న ప్రీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా బుధవారం జరిగిన సింగింగ్ పోటీల్లో హెడ్ నర్స్ ఉషారాణి మొదటి బహుమతి గెలుచుకున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చేతుల మీదుగా ఆమె బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్, ఏఆర్‌ఎంవో డాక్టర్ ధవళ భాస్కరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎస్.అప్పారావు, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, పలువురు హెడ్ నర్సులు, నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

21 నుంచి మహాభారత కథా యజ్ఞం



గోవింద్ దేవగిరి మహారాజ్

ఎంవీపీకాలనీ: ఈ నెల 21 నుంచి ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా మహాభారత కథా యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఉత్తర భారత నిర్వాహకుడు సునీల్ చౌదరి, సమన్వయకర్త సునీల్ బాలాసరియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్య రామ తీర్థ ట్రస్ట్ కోశాధికారి, ప్రసిద్ధ గురువులు గోవింద్ దేవగిరి మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు ఉపదేశించనున్నట్లు చెప్పారు. తొలిసారిగా విశాఖలో ఈ నెల 21 నుంచి 27 వరకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మహాభారతంలో పాండవులు, కౌరవుల జననం, బాల్యం, వివాదాలు, వివాహం, యుద్ధానికి దారి తీసిన పరిస్థితులు, మహాభారత యుద్ధంలో విభిన్న పరిస్థితులు, కృష్ణ భగవాన్ లీలలు, భగవద్గీత ప్రవచనం తదితర అంశాలను గోవింద్ మహారాజ్ వివరించనున్నట్లు తెలిపారు. 21వ తేదీ ఉదయం బీచ్ రోడ్డులోని వైఎంసీఏ నుంచి గాదిరాజు ప్యాలెస్ వరకు భక్తులచే కలశ యాత్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగర మహిళా భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

వ్యాధులపై అప్రమత్తం

అల్లిపురం: ఎన్‌సీడీ 3.0 సర్వే, ఆర్‌బీఎస్‌కే స్కూల్ విజిట్స్, ఏడబ్ల్యూసీ స్క్రీనింగ్ తదితర అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కొబ్బరితోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో సమీక్షించారు. ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఎన్‌సీడీ 3.0 సర్వేపై సమీక్షిస్తూ వైద్యాధికారులకు, ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలితే తక్షణమే సంబంధిత వైద్యాధికారికి, డీఎంహెచ్‌వోకు తెలియజేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల వినతి

ఎంవీపీకాలనీ: తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ విశాఖపట్నం సచివాలయ ఉద్యోగులు బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులంతా కలిసి సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసుకున్న జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. ఉద్యోగుల సాధారణ సెలవులు, సర్వీస్ రూల్స్ అమలు, మూడు నోషనల్ ఇంక్రిమెంట్ల చెల్లింపు, జూనియర్ అసిస్టెంట్ స్కేల్ వర్తింపునకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. జేఏసీ ప్రతినిధులు సురేష్‌కుమార్, సుమంత్ అబ్రహం, నాగేశ్వరరావు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్ రోడ్డులో శిథిలమైన డైనోసార్ బొమ్మ

పర్యాటకులకు నిరాశే..!

బీచ్ రోడ్డులో శిథిలమవుతున్న ఆకర్షణీయ బొమ్మలు



విరిగిన ఏనుగు పిల్ల తొండం

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో సందర్శనకు వచ్చే పర్యాటకులు, విశాఖ వాసులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది. దీనికి ప్రధాన కారణం చిన్నారులను ఎంతగానో ఆకట్టుకునే పలు బొమ్మలు శిథిలమవడం. దశాబ్దాలుగా ఎంతో పేరు గాంచిన ఈ బొమ్మలను పట్టించుకుని మరమ్మతులు చేసే వారు కరువయ్యారు. వైఎంసీఏ పక్కనే ఉన్న డైనోసార్ పార్క్‌లో ప్రధానమైన డైనోసార్ కాలు, పొట్ట భాగం శిథిలమై ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. విశాఖ మ్యూజియం గేట్ ఎదురుగా ఉన్న ఏనుగు పిల్ల బొమ్మ సైతం శిథిలమైంది. దీని తొండం విరిగిపోవడం, తోక భాగం సైతం దెబ్బతిని ఇనుప ఊసలు బయటకు కనిపిస్తున్నాయి. అధికారులు వీటికి మరమ్మతులు చేసి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.


హార్బర్‌లో జనవరి నుంచి ప్లాస్టిక్ వినియోగించొద్దు



హార్బర్‌లో దోంట్ యూజ్ ప్లాస్టిక్ లెటర్లను ప్రదర్శిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మహారాణిపేట: జనవరి 1 నుంచి ఫిషింగ్ హార్బర్, ఫిషింగ్ బోట్లలో ప్లాస్టిక్ వినియోగించరాదని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు అన్నారు. హార్బర్‌లో బుధవారం బోటు యజమానులు, చేపల వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం అమలులోకి వస్తుందని చెప్పారు. అందువల్ల హార్బర్ ఏరియాలు, మత్స్యకారులు నివసించే కాలనీలు, ఫిష్ మార్కెట్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపివేసి వాతావరణాన్ని కాపాడటంలో సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వాడక నిషేధం కోసం ఒక బృందాన్ని నియమిస్తున్నామని, ముందుగా మత్స్యకారులకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డి.మురళీ, వివిధ మత్స్యకార సంఘాల నాయకులు రత్నం, బోసు, వీర్రాజు, నాగరాజు, బాలాజీ, హనీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కీడా పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: వీల్స్ మార్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో ఎంప్లాయీస్ స్పోర్ట్స్ మీట్–2024 నిర్వహించారు. వాలీబాల్, స్పీడ్ వాక్, రింగ్ టెన్నికాయిట్, షాట్‌పుట్ వంటి క్రీడా పోటీల్లో పురుషులు, మహిళల విభాగాల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ రోజు వారి ఒత్తిడి నుంచి ఉపశమనానికి క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. ప్రభుత్వం , ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు తరచూ పోటీలు నిర్వహించి ఉద్యోగుల్లో ఒత్తిడిని దూరం చేయాలని సూచించారు. వీల్ మార్ట్‌కు చెందిన అన్ని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్
9010133346
Office mail : sakshiadvtvsp@gmail.com